

రాష్ట్ర వ్యాప్తంగా హై అలర్ట్

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం రాష్ట్రమంతటా హై అలర్ట్ ప్రకటించామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. శుక్రవారం సదాశివనగర్‌లో నివాసం వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఇదో సున్నితమైన అంశమన్నారు. అన్ని జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీలను ఆదేశించామన్నారు. పూజలకు ఎటువంటి అభ్యంతరం లేదని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని సూచించామన్నారు.

ఉమ్మడి అభ్యర్థిగా ఏపీ రంగనాథ్

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా జేడీ ఎస్ నేత ఏపీ రంగనాథ్ పోటీచేయనున్నారు. బెంగళూరునగర జేడీఎస్ అధ్యక్షుడు హెచ్.ఎం.రమేష్‌గౌడ నగరంలో శుక్రవారం ఈ విషయం ప్రకటించారు. బీజేపీతో కలిసి బరిలోకి దిగుతున్నామని, ఆ పార్టీ నేతలను విశ్వాసంలోకి తీసుకోవాలని ఆయన రంగనాథ్‌కు సూచించారు.



ఏవియేషన్ హబ్‌గా బెంగళూరు

సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్న నగరం : ప్రధాని నరేంద్ర మోదీ

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని బెంగళూరు ఆవిష్కరణలు, ఆశయసాధనలు కల్గిన నగరమని దేశ సాంకేతిక సామర్థ్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటుతోందని, కర్ణాటక అతిపెద్ద ఏవియేషన్‌హబ్‌గా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఏరోస్పేస్ పార్క్‌లో బోయింగ్ ఇండియా ఇంజనీరింగ్, సాంకేతిక కేంద్ర క్యాంపస్‌ను ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం కలబురగి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రధాని నేరుగా బోయింగ్ ఇండియా క్యాంపస్‌కు వెళ్లారు. దారి పొడవునా ప్రధానిని అభిమానులు జిందాబాద్ నినాదాలతో స్వాగతించారు. క్యాంపస్ ప్రారంభం తర్వాత ప్రధాని మాట్లాడుతూ బోయింగ్ సంస్థ ప్రపంచ సాంకేతిక రంగానికి చాటేలా క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బోయింగ్ కేంద్రం ద్వారా బెంగళూరు నగరం విశ్వవ్యాప్తంగా మరింత బలపడనుందన్నారు. ఇక్కడ సాంకేతికం, పరిశోధనలు, విన్యాసాలు, ఆవిష్కరణలకు కేంద్రం కానుందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' పరికల్పనతో 'మేక్ ఫర్ ది వరల్డ్' అనే సంకల్పాన్ని బలపరచనుందన్నారు. అమెరికా తర్వాత తొలిసారి బోయింగ్ అతిపెద్ద ఏరోస్పేస్ ఇంజనీరింగ్ సౌలభ్య కేంద్రాన్ని బెంగళూరులో ప్రారంభించిందన్నారు. దేశంలో అంతరిక్షం, రక్షణా రంగానికి గణనీయమైన ప్రగతి సాధ్యమన్నారు. ప్రధాని ప్రసంగిస్తున్న వేళ మోదీ మోదీ... అంటూ ప్రజలు నినాదాలు చేస్తుండగా సీఎం వైపు చూస్తూ మోదీ 'ముఖ్యమంత్రి జీ ఐసా హోతా రహతా హై...' (సీఎం సర్ ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి) అంటూ చలోక్తులు విసిరారు.

రాష్ట్రానికి గర్వకారణం : సీఎం

బోయింగ్ సుకన్య కార్యక్రమం రాష్ట్రానికి గర్వకారణమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బోయింగ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా విమానయాన రంగంలో మహిళలకు ఉద్యోగ, పరిశోధనల అవకాశాలు కల్పించేలా సుకన్య కార్యక్రమం ఏర్పాటు సంతోషమన్నారు. దేశంలోని ఏరోస్పేస్ రంగంలో కర్ణాటక ప్రాబల్యం కలిగి ఉందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ఎగుమతులలో 65శాతం భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. బోయింగ్ సంస్థ సాంకేతిక పరిజ్ఞానం ప్రగతిదశలో ఉన్న కర్ణాటకలో మరో చారిత్రాత్మక కేంద్రాన్ని తీసుకొచ్చిందన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలలో 400కుపైగా కంపెనీలు కల్గిన రాష్ట్రమన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, అభివృద్ధితో పాటు ఇంధన రంగంలోనూ తొలిస్థానంలో ఉన్నామన్నారు. స్టార్టప్ రాజధానిగా పేరుపొందామన్నారు. ప్రతిభావంతమైన ఉద్యోగులు, నైపుణ్యత కల్గిన మానవ వనరుల కేంద్రంగా రాష్ట్రం విరాజిల్లుతోందన్నారు. రాష్ట్రం పెట్టుబడిదారులను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు.

బోయింగ్ సంస్థ ఛైర్మన్, సీఈఓ డేవిడ్ ఎల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పరివర్తన ఆలోచనలు ఉన్నాయని అందుకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ అవకాశం బోయింగ్‌కు లభించడం సంతోషమన్నారు. భారత్‌లో ఏరోస్పేస్ ఆవిష్కరణలను ఉత్తేజపరిచేందుకు క్యాంపస్‌ను ఏర్పాటు చేశామన్నారు. 43 ఎకరాల విస్తీర్ణంలో రూ.1600 కోట్లతో క్యాంపస్ ఏర్పాటైందన్నారు. బోయింగ్ కంపెనీ సీఈఓ స్టెఫనీ పోప్ మాట్లాడుతూ బోయింగ్ సుకన్య కార్యక్రమాన్ని ప్రధాని ప్రారంభించడాన్ని ఉద్వేగభరితంగా భావిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు విమానయాన రంగంలో రాణించేలా బోయింగ్ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. మహిళలను ఏరోస్పేస్ రంగంలో భాగస్వామ్యులు చేయాలన్నదే తమ ఆశయమన్నారు. బోయింగ్ ఇండియా ఇంజనీరింగ్ పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అమెరికా తర్వాత 2023 డిసెంబరు నాటికి 6వేలమందికిపైగా ఉద్యోగులు ఉన్నారన్నారు. భారతీయ సంస్థలతో విద్య, పరిశోధనలకు కలసి పనిచేస్తామన్నారు. ప్రధానమంత్రి వెంట రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, ప్రతిపక్షనేత అశోక్‌లు ఉన్నారు. బోయింగ్ విమాన సంస్థ ప్రతినిధులతోనూ విద్యార్థులతో ప్రధానమంత్రి ప్రత్యేకంగా చర్చించారు.



నమూనాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న ప్రధాని మోదీ, సీఎం, గవర్నర్


కెనరా బ్యాంకుకు ఉత్తమ రాజభాష పురస్కారం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకులో రాజభాష హిందీని ఉత్తమంగా అమలు చేయడంపై ప్రత్యేక పురస్కారాన్ని ప్రదానం చేశారు. నైరుతి ప్రాంతాల ఉమ్మడి ప్రాంతీయ అధికార భాషా సదస్సు సంజయ్‌నగర్‌లోని హెచ్ఏఎల్ అనుబంధమైన భవనంలో శుక్రవారం జరిగింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కెనరా బ్యాంకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే సత్యనారాయణ రాజుకు ఉత్తమ రాజభాషా పురస్కారాన్ని ప్రదానం చేశారు. అధికారిక భాషా సమాఖ్య ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి 32మందికి రాజభాషా పురస్కారాలను ప్రదానం చేశారు. కెనరాబ్యాంకు ఇన్‌హౌస్ మ్యాగజైన్ 291వ ఎడిషన్ శ్రేయస్ ను ఆవిష్కరించారు.



అధికార భాషా సదస్సులో కెనరా బ్యాంకు సీఎండీ తదితరులు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.90	1,619.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,483
సామర్థ్యం (టీఎంసీలు)	10.14	61.02

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

- బళ్లారిలో ఘనంగా యోగి వేమన జయంత్యుత్సవాలు
- రెడ్డి సంఘం భవనానికి రూ.50 లక్షలు: ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పేర్కొన్నారు. బళ్లారిలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి తాను సొంతంగా రూ.50 లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే భరత్ హామీ ఇచ్చారు. మహాయోగి వేమన 612 వ జయంతి వేడుకలు బళ్లారిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. బీడీఏ మైదానం సభాభవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా రెడ్డి సమాజం అధ్యక్షుడు నారా ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగాబళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రతి గ్రామంలోనూ రెడ్డి వ్యవసాయం చేస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండేవారన్నారు. ఇతర రాష్ట్రాల్లో లాగే కర్ణాటక రాష్ట్రంలో కూడా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి, ఇతర మంత్రి వర్గంతో చర్చిస్తానన్నారు. రాష్ట్ర క్రీడలు, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి బి. నాగేంద్ర మాట్లాడుతూ రెడ్డి సముదాయం కోసం ప్రభుత్వం నుంచి రూ. 15 లక్షల నిధులు మంజూరు చేయిస్తానన్నారు. జిల్లా రెడ్డి సమాజం అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మిర్చి యార్డుకు, తాళ్లూరు రోడ్డుకు మహాయోగి వేమన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో వీరితో పాటు అధికారులు జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్, ఏడీసీ జుబేరా, మేయర్ శ్వేత, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, ఉపమేయర్ జానకి, గోవర్ధన్‌రెడ్డి, రాకెట్ల కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బసిరెడ్డి, మల్లిస్వామి, గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, యల్లారెడ్డి, ఐనాథ్ రెడ్డి, పూలచెర్ల విజయమ్మ(విజ్జీ) క్రిష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



యోగి వేమన జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే


నగరంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి


కంప్లి: కురుగోడులో వేమన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

వేమన సిద్ధాంతాలు నేటికీ ఆదర్శం


వేమన విగ్రహానికి పుష్పార్చన చేస్తున్న ఐనాథ్‌రెడ్డి

బళ్లారి సిటీ, జనవరి 19: మహాయోగి వేమన సిద్ధాంతాలు నేటికీ ఆదర్శమని వేమనపీఠం గౌరవాధ్యక్షుడు ఐనాథ్‌రెడ్డి తెలిపారు. వేణీవీరాపురంలో ఉన్న రెడ్డి వేమనపీఠంలో శుక్రవారం వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహాయోగి వేమన్న నిరాడంబర జీవితాన్ని గడిపా రన్నారు. సాధు జీవితానికి నిదర్శనం వేమన అని, సామాన్య ప్రజలకవి అని కొనియాడారు. ఈసందర్భంగా రెడ్డి వేమనపీఠం అధ్యక్షులు బసవరెడ్డి, హనుమంతరెడ్డి, రెడ్డి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగరాజరెడ్డి, సంజీవరెడ్డి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


సిరుగుప్పలో మాట్లాడుతున్న రెడ్డి గోపాల్ రెడ్డి

ఘనంగా షిరిడీసాయి ట్రస్ట్ వార్షికోత్సవం


నేత్ర పరీక్ష కోసం వేచి ఉన్న ప్రజానీకం

బళ్లారి సిటీ, జనవరి 19: నగరంలోని షిరిడీసాయి సేవా సత్సంగ్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో భాగంగా నగరంలోని బలిజ భవన్‌లో శుక్రవారం సాయిబాబాకు పూజలు చేసిన అనంతరం పలు సామాజిక కార్యక్రమాలను ప్రారంభించారు. బళ్లారి వైశ్య ఎడ్యుకేషన్ ఫండ్ జనరల్ సెక్రటరీ పత్తిగోపాలకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ ట్రస్టు గోపాలకృష్ణ అధ్యక్షతన చక్కగా నడుస్తుందని, నేత్రవైద్యుడు నాగరాజ్ సేవను మనమందరం స్మరించుకోవాలన్నారు. తదుపరి విజయ నాగ రాజు ఆధ్వర్యంలో 500మందికి పైగా కంటి పరీక్షలను నిర్వహించారు. రక్తదానం కూడా చేశారు. ట్రస్టు ఆఫీస్ బేరర్లు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు. తదుపరి ట్రస్టులో శిక్షణ పొందిన విద్యార్థులచే నృత్య ప్రదర్శన జరిగింది.

ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు.. ముగ్గురి దుర్మరణం


గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

బళ్లారి గాంధీనగర్, జనవరి 19: చిత్రదుర్గ నగరం శివారు ప్రాంతంలో శుక్రవారం ఉదయం ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. నెం.48 జాతీయ రహదారిపై మదకరిపుర సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బెంగళూరు నుండి హొసపేట వైపుకు వస్తున్న కారు మదకరిపుర సమీపంలోని ఓ వంతెన వద్ద ముందు వెళుతున్న గ్యాస్ ట్యాంకర్‌ను వెనుకవైపునుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ముగ్గురు దుర్మరణం చెందారు. వీరిలో నిర్మల(55), వినుత(40), యశస్ (2) ఘటనాస్థలంలోనే మృతిచెందగా, పణిరాజు(36), రశి(32), కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చిత్రదుర్గ నగరానికి చెందిన బసవేశ్వర మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. చిత్రదుర్గ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న మంత్రి నాగేంద్ర

బళ్లారి రూరల్, జనవరి 19: తాలుకాలోని మోకా సమీపంలో వున్న దాసరి నాగేపల్లి, బ్యాళచింత, కారేకల్లు, గొల్లనాగనహళ్లి, తంబ్రళ్లి తదితర గ్రామాలలో శుక్రవారం జిల్లా యువజన, క్రీడా మంత్రి నాగేంద్ర అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలే లక్ష్యంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్, అంగన్‌వాడీలు, హైస్కూలు భవనాలు తదితర వాటిపై దృష్టి సారించి వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను అప్‌గ్రేడ్ చేసి నర్సరీని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేరా, మంత్రి సోదరుడు వెంకటేష్ ప్రసాద్, మల్లన్నగౌడ, అన్నా నాగరాజు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించిన సర్ ఎంవీ పీయూ కాలేజీ

బళ్లారి సిటీ, జనవరి 19: సర్‌ఎంవీ ఇనిస్టిట్యూట్ కర్ణాటకలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. పీయూసీ, నీట్, జేఈ పరీక్షల్లో ఈ సంస్థ అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందని సర్‌ఎంవీకాలేజ్ వైస్ ప్రసిడెంట్ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో 720మార్కులకు గాను 705,703మార్కులు సాధించడం ద్వారా ఈసంస్థ కర్ణాటకలో అత్యధిక మార్కులు సాధించిన విద్యాసంస్థగా అవతరించిందన్నారు. ఈసంస్థ విద్యార్థులు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా దేశంలోని ఎన్ఐటీ, ఐఐటి, ఐఐఐటి వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో తమ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

2023లో దేశంలోని వివిధ ఐఐటి కాలేజీల్లో పదిమందికి పైగా విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు. 18కిపైగా ఎన్ఐటి విద్యార్థులు ప్రవేశం పొంది కర్ణాటకకు కీర్తి ప్రతిష్టతలు తెచ్చారన్నారు. ఈసంస్థ సాధించిన మరో అద్భుతమైన విజయం ఏమిటంటే ఇందులో చదివిన విద్యార్థులు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు ఎంపిక కావడం. ప్రతి సంవత్సరం 300మందికి పైగా విద్యార్థులు వైద్యా కళాశాలల్లో చేరుతున్నారని, ఇది సంస్థ సాధించిన అపూర్వ విజయమన్నారు. ఇటీవలి సంవత్సరాలలో ఈసంస్థ తన సేవలను కర్ణాటకలోని ఇతర నగరాలకు విస్తరిస్తోందని, ఇందులో భాగంగా సర్‌ఎంవీ ఇన్‌స్టిట్యూట్ శివమొగ్గ, బళ్లారినగరాల్లో విద్యాసంస్థలను ప్రారంభించిందన్నారు. అన్ని నగరాల్లోని విద్యార్థుల నుండి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. సంస్థ ప్రతిశాఖలో అత్యుత్తమ విద్యావవ్యస్థను అందిస్తుందని, జనవరి 21వతేదీ ఆదివారం సర్‌ఎంవీ కాలేజీలో పదవ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3వేలకు పైగా విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



సర్ ఎంవీ (సత్యం) పీయూ కాలేజీ

కమ్మ కార్పొరేషన్ సమావేశానికి తరలిరండి

సిరుగుప్ప, జనవరి 19 : బళ్లారిలో రేపు జరగనున్న కమ్మ కార్పొరేషన్ సమావేశానికి రెండు వేల మందికి పైగా తరలివెళుతున్నట్లు కమ్మసమాజం గౌరవాధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో శుక్రవారం కమ్మ సంఘం భవనంలో ఆదివారం బళ్లారిలో జరుగనున్న కమ్మ కార్పొరేషన్ సమావేశానికి వెళ్లేందుకు కమ్మ కార్యవర్గం సభ్యులకు అవసరమైన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్మ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారు వున్నారని, ప్రభుత్వ సబ్సిడీలు అందడంలేదని ఆయన తెలిపారు. కావున రానున్న రోజుల్లో ప్రతి ఒక్క కమ్మ కులస్తుడు అన్ని రంగాలలో ముందడుగు వేసి, ప్రభుత్వ సౌలభ్యాలు పొందే ఉద్దేశంతో కమ్మ కార్పొరేషన్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. బళ్లారికి వెళ్లేందుకు బస్సులు, ట్రాక్స్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున తాలుకా వ్యాప్తంగా వున్న కమ్మ సంఘం సభ్యులు, పదాధికారులు, యువత, మహిళలు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం అధ్యక్షులు జాలాది రాధాకృష్ణ, ప్రముఖులు దేవీనగర్ ప్రతాప్ చౌదరి, మాజీ అధ్యక్షులు కోనేరు గోపాలకృష్ణ, రమేష్ బాబు, చౌదరి,రఘుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రామమందిర ప్రారంభం సందర్భంగా రంగస్థల వేడుకలు


సమావేశంలో ప్రభుదేవా, తిప్పేస్వామి, అడవిస్వామి

బళ్లారి సిటీ, జనవరి 19: చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించనున్న అయోధ్య శ్రీరామ దేవాలయ ప్రారంభోత్సవం సందర్భంగా బళ్లారిలో కూడా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవా కప్పగల్లు, కర్ణాటక బయలాట అకాడమీ మాజీ సభ్యులు తిప్పేస్వామి, అడవిస్వామి తెలిపారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనవరి22, 23, 24 తేదీల్లో నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని రాఘవ కళామందిరంలో మూడు రోజుల పాటు నాటకం, బయలాట, తోలుబొమ్మలాట, సంగీతం, నృత్యం, ఉపన్యాసాలు ఉంటాయన్నారు. 22న సాయంత్రం శ్రీరామ రంగ ఉత్సవాల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. సిరిగేరిలోని ధాత్రి రంగ సంస్థ కళాకారులు తిప్పేస్వామి దర్శకత్వం వహించిన రామరావణ యుద్ధ బయలాటను ప్రదర్శిస్తారన్నారు. అంతకు మునుపు శ్రీమతి పద్మావతి, కుమారి ప్రకృతిరెడ్డి పాటలు, సునీత వీణవాద్యం ఉంటాయన్నారు. 23న సాయంత్రం ధార్వాడకు చెందిన న్యాయవాది దేశ్‌పాండే శ్రీరాముని ఆదర్శాలపై ఉపన్యసిస్తారన్నారు. అనంతరం బెళగల్లువీరణ్ణ రామాంజిని తోలుబొమ్మలాట బృందం లంకా దహనం తోలుబొమ్మలాటను ప్రదర్శించనున్నారని తెలిపారు. తదుపరి చారులత శ్రీనిధి బృందంచే అయోధ్య రామ అనే నృత్య నాటిక ప్రదర్శిస్తారన్నారు.

మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి



నిరసనలో పాల్గొన్న రైతులు

బళ్లారి సిటీ, జనవరి 19: మిర్చిపంటకు మద్దతు ధర ప్రకటించాలని, కోల్డ్‌స్టోరేజీలో మిర్చి బస్తాలకు పెంచిన రుసుమును ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతుసంఘం ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ ఈఏడాది మిర్చి పంటను పండించడానికి రైతులు భారీగా ఖర్చు చేశారని, విత్తనం, ఎరువుల ధర విపరీతంగా పెరిగినా రైతు అప్పులు చేసి పంట పండించారన్నారు. కాల్వ నీరులేని సమయంలో ట్యాంకర్ నీళ్లతో పంట పండిస్తున్నారని, ఇందుకోసం లక్షలాది రుపాయలు వెచ్చించి పండించిన మిర్చి పంటకు ఇప్పుడు ధర రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనివల్ల చాలా మంది రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మిరప 5531రకం పంటకు కనీసం రూ.25000 రుపాయలు, బాడగి రకం పంటకు రూ. 55వేలు మద్దతుధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈనిరసనలో గురల్లి రాజా, జిల్లా ఉపాధ్యక్షుడు బసన్న, ఈరన్న, కాసీంసాబ్, తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం క్రిమిసంహారక బాటిళ్లతో ఆందోళన


క్రిమిసంహారక మందులతో ఆందోళన చేస్తున్న దృశ్యం

బళ్లారి గాంధీనగర్, జనవరి 19: బిల్లులు చెల్లించక పోతే అధికారుల ముందే ఆత్మహత్య చేసుకుంటామని కాంట్రాక్టర్లు క్రిమినాశక మందు బాటిళ్లను చేతబట్టి ఆందోళన చేసిన ఘటన కొప్పళ జిల్లా పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకుంది. తమ చావుకు అధికారులే కారమణంటూ హెచ్చరిస్తూ వారు ఆందోళనకు దిగడంతో.. కొంతసేపు కొప్పళ జిల్లా పంచాయతీ కార్యాలయం ముందు ఉద్విగ్న పరిస్థితి నెలకొంది. ఆందోళన కారులు ఏకంగా క్రిమి సంహారక మందు బాటిళ్లను చేతబట్టి నిరసనకు దిగడంతో అధికారులు ఆందోళన పడాల్సి వచ్చింది. పరిస్థితి విషమించడంతో పోలీసుల జోక్యంతో అధికారులు చర్చలు జరిపారు. వారం రోజుల్లోగా పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకం క్రింద కుష్టిగి తాలూకా పరిధిలో చేపట్టిన ఉద్యోగ ఖాత్రి పనులకు అవసరమైన ఇసుక, ఇనుపరాడ్లు, కంకరలతో పాటు అనేక వస్తువులను పలువురు కాంట్రాక్టర్లు సరఫరా చేశారు. పనులు ముగిసి నాలుగేళ్ళు కావస్తున్నా ఇంతవరకు కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన రూ.37కోట్ల రూపాయల బిల్లులు అధికారులు పెండింగ్ పెట్టడంతో కాంట్రాక్టర్లు విసుగుచెంది క్రిమినాశక మందు బాటిళ్ళతో ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం పనులు సక్రమంగా జరగలేదని అందువల్లనే బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సామగ్రి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో తాను పనులు పరిశీలించి వారంలోగా బిల్లులు చెల్లిస్తామని జిల్లా పంచాయతీ సిఇఓ రాహుల్ రత్నం పాండే తెలిపారు.

హోసూరు జోన్

ఆనేకల్‌లో సెంట్రింగ్ కూలి ఇద్దరు కార్మికుల దుర్మరణం


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

హోసూరు, జనవరి 19: బెంగళూరు గ్రామీణ పరిధిలోని ఆనేకల్ తాలూకా బ్యాడరహళ్లిలో నిర్మాణ దశలోని ఓ ప్రైవేట్ పాఠశాల సెంట్రింగ్ కూలి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు సెయింట్ ఆన్స్ క్రిస్టియన్ మిషనరీ పాఠశాల ప్రాంగణంలో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనలో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సాహిబ్ (31), మినార్ బిశ్వాస్ (32) అనే ఇరువురు మృతి చెందారు. ఇక్కడ నిర్మాణ పనుల్లో ఉత్తర కర్ణాటకతోపాటు ఉత్తరభారత్‌కు చెందినవారు పనిచేస్తున్నారు. 25మంది కార్మికులు పనులు చేస్తున్నవేళ రెండో అంతస్థులోని సెంట్రింగ్ ఒక్కసారిగా కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. 15మంది కార్మికులు సెంట్రింగ్ పైభాగాన ఉన్నారు. వీరిలో 11మందికి స్వల్పగాయాలు కాగా ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌డీఆర్ఎఫ్ బృందంతోపాటు బెంగళూరు గ్రామీణ ఎస్పీ మల్లికార్జున బాలదండి సందర్శించారు. ఆనేకల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బిందుసేద్యంపై అవగాహనా శిబిరం

హోసూరు(సిప్‌కాట్) జనవరి 19: హోసూరు ప్రాంతంలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పలు అంశాలపై అవగాహనా శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టీ బారందూరు గ్రామంలో వరి తర్వాత పుష్పాలు, ధాన్యాలసాగుపై రైతులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. 40 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. భువనగిరికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బిందుసేద్యం ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. అలాగే సబ్సిడీ పథకాల గురించి రైతులకు వివరించారు. ముగుళూరు పంచాయతీ చైర్మెన్ మహేశ్ పాల్గొని రైతులు వ్యవసాయ సాంకేతికతలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదియమాన్ వ్యవసాయ కళాశాల పరిశోధనా సంస్థ అత్తిముగం, వ్యవసాయ సాంకేతిక నిపుణుడు హరీష్ వరి, ఇతర ధాన్యాలు, పుష్పాల సాగు సహజ తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ, నిర్వహణ పద్ధతులు, విత్తనశుద్ధి ప్రాముఖ్యత, జిప్సంబెడ్, కంపోస్టు వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు, వ్యవసాయ అధికారిణి రేణుక రైతులకు సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యత, జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాల లోపం వల్ల వచ్చే వ్యాధులు నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

రైతుల నుంచి192 వినతులు

హోసూరు(కృష్ణగిరి) జనవరి 19: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన రైతుల ఫిర్యాదుల దినోత్సవంలో 192 వినతులు అందాయి. 2023 డిసెంబరులో రైతుల నుంచి వచ్చిన 263 అర్జీలలో 220 పరిష్కారమైనట్లు కలెక్టర్ సరయు తెలిపారు. సమావేశంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వాయువ్య ప్రాంతానికి అనువైన కొత్తరకాల వరి, మామిడి వంగడాలను అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారులు తెలిపారు. 3 లేదా 5 సంవత్సరాలకు బిందుసేద్యం తీరును మార్చాలన్నారు. బ్యారేజీ నిర్మించి దక్షిణ పినాకిని, పాంబారు వద్ద బ్యారేజీని నిర్మించాలన్నారు.


ఫిర్యాదుల పరిష్కార దినోత్సవంలో కలెక్టర్, ఇతర అధికారులు

జాగృతి జాతాను పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో సమావేశమైన జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే

రాయచూరు, జనవరి 19: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్న రాజ్యాంగ జాగృతి జాతాను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే ఆదేశించారు. జాతా నిర్వహణకు సంబంధించి శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 26వ తేదీ రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఈ జాతాను నగరంలోని మహాత్మగాంధి స్టేడియం నుంచి ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ ప్రారంభిస్తారన్నారు. జాగృతి జాతా జిల్లాలోని మొత్తం 192 స్థానిక సంస్థల గుండా ప్రయాణిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో జాతాను గ్రామ పంచాయతీస్థాయి అధికారులు ఘనంగా స్వాగతించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జాతాలో తహసీల్దార్‌లు, తాలూకా పంచాయతీ కార్యనిర్వాహణ అధికారులు విధిగా పాల్గొనాలన్నారు. ముఖ్యంగా స్వచ్ఛత పనులు ఆరోగ్యసంరక్షణ తాగునీటి వసతి వంటివి ఏర్పాటు చేసి కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.


సైలెన్సర్‌ల ధ్వంసం

రాయచూరు, జనవరి 19 : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో స్వాధీనం చేసుకున్న శబ్దకాలుష్యం చేసే ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లను జిల్లా పోలీసులు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా ఎస్పీ పరేడ్ మైదానంలో సైలెన్సర్‌లను బుల్డోజర్‌లతో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్పీ శబ్దకాలుష్యం వెదజల్లే సైలెన్సర్‌లను అమర్చుకుని ప్రజలకు విసుగుకల్పిస్తున్న 250 మంది ద్విచక్ర వాహన దారులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల 50వేల జరిమానా రూపంలో వసూలు చేశామన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు స్వచ్ఛందంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న 380 సైలెన్సర్‌లను ధ్వంసం చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. శబ్ధకాలుష్యానికి పాల్పడే వాహనదారులను శిక్షిస్తామన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బందా కనకలింగేశ్వరరావు (జయంతి)



రంగస్థల, సినిమా నటుడు బందా కనకలింగేశ్వరరావు 1907 జనవరి 20న కృష్ణా జిల్లా ఆటపాకలో జన్మించారు. నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడిగా రాణించడమే కాక న్యాయవాదిగాను ప్రతిభ చాటారు. తర్వాత 1938లో ఏలూరులో నాటక కళా శాలను స్థాపించి పలువురికి శిక్షణ ఇచ్చారు. ప్రభాత్ థియేటర్ సంస్థ ద్వారా నాటకాలలో నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టారు. తొలితరం సినిమాలైన బాల నాగమ్మ, పాదుకా పట్టాభిషేకం తదితర సినిమాలలో నటించారు. రాష్ట్రపతి అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. 1968 డిసెంబరు 3న కన్నుమూశారు.

విఠలాచార్య (జయంతి)



'జానపద బ్రహ్మ'గా పేరొందిన బీ విఠలాచార్య 1920 జనవరి 20న కర్ణాటక రాష్ట్రం ఉడుపిలో జన్మించారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాలకు దర్శకత్వంతోపాటు నిర్మాత గానూ వ్యవహరించారు. అప్పటి పరిమితమైన సాంకేతిక పరిజ్ఞానంతో అపారమైన ప్రతిభను చాటారు. తక్కువ ఖర్చుతో కనులకు ఇంపైన కళాఖండాలను రూపొందించారు. 1954లో విఠల్ ప్రొడక్షన్స్ ఏర్పాటు చేసి 'కన్యాదానం' సినిమాను రూపొందించారు. ఎన్టీఆర్, కాంతారావులకు మాస్ ఫాలోయింగ్ తెచ్చింది ఆయన సినిమాలే. ఎంతో దక్షత, బాధ్యతగల నిర్మాత. 1999 మే 28న కన్నుమూశారు.

కృష్ణంరాజు (జయంతి)



తెలుగు వెండితెరపై 'రెబెల్ స్టార్'గా పేరొందిన ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు 1940 జనవరి 20న పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో జన్మించారు. గోపీకృష్ణ మూవీస్ అధినేత. 183 సినిమాలలో నటించారు. ఉత్తమ నటుడిగా నంది అవార్డులతోపాటు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. కెరీర్ ప్రారంభంలో పాత్రికేయుడిగా పనిచేశారు. రాజకీయాల్లో రాణించారు. 1998లో కాకినాడ నుంచి లోక్‌సభకు ఎన్నికై వివిధ శాఖలకు కేంద్రమంత్రిగా వ్యవహరించారు. 2022 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

బీజేపీతోనే దళితులకు న్యాయం

- మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప



బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్రస్థాయి సమావేశం ప్రారంభంలో మాజీ సీఎం యడియూరప్ప తదితరులు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్య విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టడం చారిత్రక నిర్ణయమని, బీజేపీతోనే దళితులకు సంపూర్ణ న్యాయం సాధ్యమని బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ సీఎం యడియూరప్ప పిలుపునిచ్చారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన రాష్ట్రస్థాయి సమావేశాన్ని ప్రారంభించారు. బీజేపీ విజయాలలో దళితులు కీలకపాత్ర పోషించారని, ఈసారి ఐకమత్యంతో మొత్తం 28 పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఘన విజయం సాధించి ప్రధానికి కానుకగా సమర్పిద్దామని పిలుపునిచ్చారు. శతాబ్దాలుగా అణగారినవర్గాల సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మక చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ మార్కు సామాజిక న్యాయం ఒట్టి బూటకమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు దాటినా ఎస్సీ ఎస్టీలు మైనారిటీలు ఇంకా ప్రధాన జీవనస్రవంతిలోకి రాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు మచ్చుతునకగా మిగిలిపోతాయన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగేలా ఆదేశాలు జారీ చేశానన్నారు. బొమ్మై ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రిజర్వేషన్లను పెంచారన్నారు. దళితులకు నిజమైన మిత్రుడు బీజేపీయేనన్నారు.

22న సెలవు ప్రకటించాలి

కాగా అయోధ్యలో రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. ఎస్టీ మోర్చా సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికే సగం రోజు సెలవు ప్రకటించిందని, దేశంలోని అనేక రాష్ట్రాలు సెలవు ప్రకటించాయన్నారు. శ్రీరామచంద్రుడు దేశంలోని 140 కోట్లమంది ప్రజలకు ఆదర్శపురుషుడన్నారు. ఈకార్యక్రమాన్ని ప్రజలంతా వీక్షించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఎస్టీలకు బీజేపీ సదా సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ వచ్చిందని, కీలకమైన రాష్ట్రపతి పదవిని కూడా ఎస్టీ వర్గానికి చెందిన ద్రౌపదిముర్ముకు అప్పగించడం ద్వారా ప్రధాని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. దళితులపై కాంగ్రెస్ కేవలం మొసలికన్నీరు కారుస్తోందని, ఆ పార్టీ వలలో చిక్కుకోవద్దని హితవు పలికారు. ఏ నాటికైనా బీజేపీతోనే దళితులకు సంపూర్ణ న్యాయం సాధ్యమని యడ్యూరప్ప ధీమా పలికారు. సమావేశాన్ని ఉద్దేశించి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీటీ రవి, మాజీ మంత్రులు బీ శ్రీరాములు, బాలచంద్రజార్కిహోళి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బంగారు హనుమంతు తదితరులు ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పదాధికారులు పాల్గొన్నారు.



వేమనకు పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం

సరళమైన పద్యాలతో చైతన్యం కలిగించిన యోగివేమన: సీఎం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చదువురాని వారు సైతం చక్కగా అర్థం చేసుకునేలా పద్యాలు రాసి యోగి వేమన సమాజాన్ని చైతన్య పరిచారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్ర కళాక్షేత్రలో ఏర్పాటైన యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అంతకుముందు యోగివేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కన్నడ సాంస్కృతిక శాఖా మంత్రి శివరాజ్ తంగడగి, రవాణా శాఖా మంత్రి ఆర్.రామలింగారెడ్డి, కర్ణాటక రెడ్డి జన సంఘం అధ్యక్షుడు ఎస్.జయరామరెడ్డి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి, మాజీ మంత్రి హెచ్‌ఎం.రేవణ్ణ, ప్రముఖ రచయిత్రి జానపద కళాకారిణి డా.కెఆర్.సంధ్యారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

300 కోట్ల విలువైన ఆస్తి... 83 కోట్లకే లీజు

- రైల్వే అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో రైల్వే భూ అభివృద్ధి ప్రాధికారకు అనుబంధమైన 300కోట్ల రూపాయలకుపైగా విలువ చేసే భూమిని కేవలం రూ.83కోట్లకే లీజుకు కట్టబెట్టేందుకు అధికారుల కుట్రపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నైరుతి రైల్వే కేంద్ర కార్యాలయం హుబ్బళ్ళి రైల్వే స్టేషన్‌కు 4 కిలోమీటర్ల దూరంలోనూ హుబ్బళ్ళి సెంట్రల్ బస్టాండ్‌కు 2 కిలోమీటర్ల దూరంలో ఎంటీఎస్ కాలనీ 13 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. కొన్నేళ్లకాలంగా ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు ఎవరూ నివసించడం లేదు. ఈ ప్రదేశంలోని 13 ఎకరాల భూమి విలువ కనీసం 300 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. అయితే రైల్వే అధికారులు భవనాలతోపాటు పూర్తిగా భూమిని 83 కోట్లకు 99ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గురువారం వేలం ప్రక్రియ సాగింది. ఎక్కువమంది వేలంలో పాల్గొనాలని ప్రయత్నించినా బడా వ్యక్తుల ప్రాబల్యంతో ఎవరినీ ప్రవేశించకుండా అడ్డుకున్నారు. వీటి వెనుక రైల్వే అధికారుల సహకారం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. రైల్వే ప్రాధికార అధికారులు టెండరు ద్వారా లీజుకు ఇచ్చేలా ఆహ్వానించారు. ప్రతి ఎకరాకు 6.5 కోట్ల రూపాయలు కోట్ చేశారు. అయితే మార్కెట్‌లో ఎకరా రూ.25కోట్లకుపైగా విలువ చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 99ఏళ్లపాటు లీజు అంటే దాదాపు భూమిని మూడు తరాలు వారికే చెందుతుంది. కోట్లాది రూపాయలు ఈ కుట్రలో చేతులు మారాయనే విమర్శలు ఉన్నాయి.



ఎంటీఎస్ కాలనీలోని భవనాలు

అయోధ్య రాముడికి తులసి మాల

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభమవుతున్న తరుణంలో ఎన్నో కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. బెంగళూరు నగరం జయనగర్‌కు చెందిన డాక్టర్ శివరాజ్‌కుమార్ శ్రీరాముడికి తులసీ సేవ చేయదలచారు. అయోధ్యకు సుమారు 60 కిలోమీటర్ల దూరాన రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. గత ఏడాది సెప్టెంబరులో గుజరాత్ తులసీవనం నుంచి విత్తనాలు తీసుకెళ్ళి సాగు చేశారు. ప్రస్తుతం తులసీ మొక్కలు పెరిగాయి. బెంగళూరులో పూల అల్లికలలో అనుభవం కలిగిన ముగ్గురు యువకులను ఇటీవలే విమానంలో అయోధ్యకు పంపారు. 17న బుధవారం నుంచి ఆలయానికి నిత్యం తులసితో రూపొందించిన ప్రత్యేకమైన హారాలు తదితరాలను పంపారు. ఈనెల 22న రామలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ప్రత్యేకమైన తులసీ హారం సమర్పించేందుకు సిద్ధమయ్యారు. శ్రీరాముడికి తులసీ సేవ చేసుకునే సౌభాగ్యం దక్కిందని డాక్టర్ శివరాజకుమార్‌కు ప్రకటించారు.



తులసి మాలలను చూపుతున్న శివరాజ్



మోదీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

ప్రధాని మోదీకి ఆత్మీయ స్వాగతం



డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బెంగళూరులో ఆత్మీయ స్వాగతం లభించింది. కలబురగి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్ర ప్రభుత్వం తరపున డీసీఎం డీకే శివకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి కేజె జార్జ్, బెంగళూరు నగర లోక్‌సభ సభ్యులు తేజస్వీ సూర్య, సదానందగౌడ, పీసీమోహన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీష్‌గోయల్, డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీసు కమిషనర్ దయానంద్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ మంత్రి అశ్వత్థనారాయణ సహా బీజేపీ నేతలు, ము ఖ్య అధికారులు స్వాగతించారు. కాగా ఢిల్లీ నుంచి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలబురగి విమానాశ్రయంలో కేంద్రమంత్రి భగవంత్‌ఖూబా రాష్ట్ర వైద్యవిద్యాశాఖా మంత్రి శరణప్రకాష్ పాటిల్, ఎంపీ ఉమేష్‌జాదవ్, ఎమ్మెల్యే బసవరాజ మత్తిమడు, ఎమ్మెల్సీ బీజీ పాటిల్, నామోశి, జిల్లాధికారి ఫౌజియా తరన్నుమ్, నగర పోలీసుకమిషనర్ చేతన్‌కుమార్‌లు స్వాగతించారు.

ప్రధానితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర భేటీ

బెంగళూరు నగరానికి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బివై.విజయేంద్ర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానిని కలిసిన వారిలో మాజీ ముఖ్యమంత్రి డీవీ సదానందగౌడ, బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్విసూర్య, మాజీ మంత్రులు ఎంటీబీ నాగరాజ్, బైరతి బసవరాజ్, యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ తదితరులున్నారు.

కంటి జబ్బులతో భద్రం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాన్య దృష్టి సమస్యలు ఉన్నవారితో పోలిస్తే మయోపియా ఉన్నవారిలో మూడింతలు ఎక్కువ జబ్బులు ప్రబల వచ్చునని అగర్వాల్ ఆసుపత్రుల నిపుణులు సునిత అభిప్రాయపడ్డారు. దృష్టి సమస్యలపై అగర్వాల్ ఆసుపత్రిలో ప్రత్యేక సదస్సు జరిగింది. మయోపియా, గ్లూకోమాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. చదువు, కంప్యూటర్, వీడియో గేమ్‌లు సమీపంనుంచి టీవీ చూడడం వంటి చర్యలను తగ్గించడం ద్వారా పిల్లల్లో మయోపియాను నియంత్రించవచ్చునన్నారు. వీటిని వ్యసనంగా మార్చుకుంటే దృష్టి సమస్యలు పెరుగుతాయన్నారు. గ్లూకోమా దేశంలోనే దృష్టి సమస్యలను మూడో వంతుగా మారిందని అగర్వాల్ క్లినిక్‌ల ప్రాంతీయ ముఖ్యులు డాక్టర్ రామ్ ఎస్ నిర్లే అభిప్రాయపడ్డారు. దృష్టి సమస్యలు వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు.

బీకే హరిప్రసాద్‌ను విచారించిన సీసీబీ అధికారులు

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభం వేళ రాష్ట్రంలో గోద్రా తరహా సంఘటనలు చోటు చేసుకునే కుట్ర సాగుతోందనే కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ వ్యాఖ్యలపై సీసీబీ అధికారులు విచారణకు వెళ్లారు. శుక్రవారం బీకే హరిప్రసాద్ కుమారకృప అతిథిగృహంలో ఉన్న సమాచారం మేరకు అక్కడకు ఏసీపీతోపాటు సీనియర్ అధికారులు వెళ్లారు. ఇటీవల రాష్ట్రంలో గోద్రా తరహా సంఘటనలు చోటు చేసుకునే కుట్ర అనే వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరారు. ఇందుకు బీకే హరిప్రసాద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సురక్షిత దృష్ట్యా వ్యాఖ్యానించానన్నారు. నాకు వీవీఐపీ ఆతిథ్యం అవసరం లేదని, కేసు నమోదు చేసి వారెంట్‌తో రావాలని అప్పుడే వివరణ ఇస్తానన్నారు. దీంతో సీసీబీ అధికారుల బృందం వెనుతిరిగింది. అనంతరం బీకే హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులు వివరణ కోరారని అందుకు నేను సిద్ధమన్నారు. నిజనిర్ధారణ పరీక్షలు జరపాలని నాతోపాటు బీజేపీ అధ్యక్షుడిని పిలవాలన్నారు. ద్వేషపూరితంగా మాట్లాడిన కల్లడ్క ప్రభాకర్‌భట్, ఎంపీ అనంత కుమార్ హెగ్డేలపై ఎటువంటి చర్యలు లేవని, కానీ నన్ను విచారించేందుకు పోలీసులు వచ్చారన్నారు. మేం ఏ ప్రభుత్వంలో ఉన్నామనేది అనుమానం కలుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా పార్టీకోసం పనిచేసినా నా పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్య కార్యకర్తల స్థితి ఎలా ఉంటుందో అంటూ ప్రశ్నించారు.

చిక్‌పేట ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ సీఎం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్‌ను మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్వల్పంగా గుండెనొప్పి రావడంతో ఆయన నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. తాను ఆరోగ్యంగానే ఉన్నానని పార్టీ కార్యకర్తలు అభిమానులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని గరుడాచార్ నగరంలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రొటీన్ ఆరోగ్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరానని శనివారం యథావిధిగా పార్టీ కార్యాలయానికి వస్తానని ప్రకటనలో వెల్లడించారు. కాగా నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న ప్రముఖ సినీనటి హేమాచౌదరిని కూడా మాజీ సీఎం బొమ్మై పరామర్శించారు. అంతకుముందు ఆయన బెంగళూరు ఉత్తరాది మఠంలో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో డా.జయశ్రీ అరవింద ఆలపించిన శ్రీరాముడి భక్తి గీతా ఆడియో కేసెట్‌ను లాంఛనంగా విడుదల చేశారు. కార్యక్రమంలో బసవనగుడి ఎమ్మెల్యే రవి సుబ్రమణ్య, ఉత్తరాది మఠం కన్వీనర్ సత్యధ్యాన ఆచార్య కట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్‌ను పరామర్శిస్తున్న మాజీ సీఎం బొమ్మై

అయోధ్యలో కర్ణాటక రుచులు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వ్యాప్తంగా నిత్యం వేలాది మంది విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించే అదమ్య చేతన సంస్థ ఆయోధ్యలో కర్ణాటక రుచులను అందించదలచారు. అదమ్యచేతన ముఖ్యులు తేజస్విని అనంతకుమార్ మాట్లాడుతూ పచ్చదనం, వ్యర్థాలు లేని వంటగది ద్వారా ఏళ్ళతరబడి లక్షలాది మంది విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. దేశ ప్రజలంతా సంబరంగా భావిస్తున్న అయోధ్యలో రామమందిర ప్రారంభం రామలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేళ దేశవిదేశీ భక్తులకు కర్ణాటక రాష్ట్ర రుచులను అందించదలచామన్నారు. నెలరోజుల పాటు ప్రతిరోజు వేయి మందికి వివిధ రకాల వంటకాలను అందిస్తామన్నారు. ఇందుకోసం 16మంది వంటతయారీ బృందం అయోధ్యకు తరలారన్నారు. ఆదివారం నాతో పాటు మరికొందరు వస్తారన్నారు. కర్ణాటక వంటకాలు ఇడ్లీ సాంబారు, ఉప్మా, బిసిబెళెబాత్, తీపి పొంగల్, ఖారా పొంగల్ వంటి పదార్థాలను పంపిణీ చేస్తామన్నారు. రామమందిరానికి సమీపంలోనే తాత్కాలిక వంటగదిని ఆరంభించామన్నారు. ఇప్పటికే రెండువాహనాలలో వంటసామాగ్రి అయోధ్యకు చేరుకున్నారన్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ రూపంలో రెండు పదార్థాలను అందిస్తామన్నారు.



అయోధ్యకు తరలిన బృందంతో తేజస్విని అనంత కుమార్

పారిశ్రామికవేత్తకు సత్కారం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామనగర్ ప్రాంతంలో ప్రాచీనమైన కవణాపుర బసవేశ్వరస్వామి వేడుకలలో భాగంగా పారిశ్రామిక వేత్త సునితా తిమ్మేగౌడను ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధితో పాటు సౌలభ్యాల కోసం ప్రత్యేకత చూపిన మేరకు ఆలయంలో జరిగిన ధార్మిక కార్యాక్రమాల వేళ జెమిని, జంబో సర్కస్ యజమాని సునితా తిమ్మేగౌడను ఆలయ పాలకమండలి సభ్యులు సత్కరించారు. ఇదే సందర్భంగా సునీతా మాట్లాడుతూ బసవేశ్వర ఆలయం సుందరంగాను రమణీయంగాను ఉందన్నారు. ఆలయంలో పూజలలో పాల్గొనడం ఇష్టంగా భావిస్తానన్నారు. సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడాన్ని కొనియాడారు.



సునీతాగౌడను సత్కరిస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు

21న సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాచనగరి మైసూరులోని తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న సంక్రాంతి సంబరాలు ఏర్పాటవుతున్నాయి. ఈ మేరకు సంస్థ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మైసూరు జయలక్ష్మీపురం మహాజన కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సంబరాల్లో భాగంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు, 5 నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులకు మకర సంక్రాంతి అనే అంశంపై చిత్రలేఖన పోటీలు, సంక్రాంతి తెలుగు పాటలు, పద్యాలు ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. తిరుమల తిరుపతి ఆస్థాన గాయకుడు గానగంధర్వ గురజాడ మధుసూదన రావు బృందంచే అన్నమయ్య కీర్తనల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సంబరాల్లో సమితి సభ్యులతో పాటుమైసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరపడ్డ తెలుగు వారు కూడా పాల్గొనవచ్చునని ప్రకటనలో కోరారు.

ఐదురోజులు ఉచిత కాన్పులు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభం, రామలల్ల విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు చెందిన జ్ఞానయోగి సిద్దేశ్వర మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత కాన్పులు జరపనున్నట్టు ప్రకటించారు. 18నుంచి 22వరకు ఉచితంగా కాన్పులు జరుపుతున్నట్టు ప్రకటించారు. ఓపీడీ, నార్మల్ డెలివరీ, సిజేరియన్, మెడికల్, ల్యాబ్ టెస్టులు, స్కానింగ్ అన్నీ ఉచితమేనని ప్రకటించారు. కాన్పుల వేళ మగశిశువు జన్మిస్తే రాముడిగాను, ఆడబిడ్డ జన్మిస్తే సీత ప్రతిరూపంగా భావించి సేవాభావంతో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు డాక్టర్ శరణ్ మలఖేడకర్ తెలిపారు. రామమందిరం ప్రారంభం వేళ భిన్నమైన రీతిలో సేవలు ఆరంభమయ్యాయని పేదలకు తమవంతుగా ఉచితంగా కాన్పులు జరపదలిచినట్లు తెలిపారు.

ఆనేకల్‌కు రెండేళ్లలో కావేరి నీరు : ఎంపీ

దొమ్మసంద్ర, జనవరి 19: ఆనేకల్ తాలూకాకు రెండేళ్లలో కావేరినీటిని అందించనున్నట్టు ఎంపీ డీకే సురేశ్ వెల్లడించారు. గుంజూరు నుంచి ముగళూరు వరకు రూ.5కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. జనస్పందన కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను సాధ్యమైన మేరకు అక్కడికక్కడే పరిష్కరించదలిచామన్నారు. శుక్రవారం ఏర్పాటైన జనస్పందన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ తాలూకాలో 1.20 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. 288 పల్లెలకు కావేరి నీరు అందించే హామీని ఇచ్చారు. మెట్రో డీపీఆర్, ఆనేకల్ అత్తిబెలె-సర్జాపుర వరకు టెండర్ పిలిచారని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రతి కుటుంబానికి సగటున 5వేల రూపాయల వరకు ప్రయోజనం లభిస్తోందని ఎమ్మెల్యే శివణ్ణ పేర్కొన్నారు. 52 టీఎంసీలతో 288 పల్లెలకు 780 కోట్లతో కావేరి నీటి పనులకు అనుమతి లభించిందని, 20 రోజుల్లో టెండరు ప్రక్రియ ఆరంభం కానుందన్నారు. కాగా సర్జాపుర గ్రామపంచాయతీని నగరసభగా మార్చేందుకు తీర్మానమైందని ఎంపీ డీకే సురేశ్ పేర్కొన్నారు. సర్జాపుర మైదానాన్ని స్టేడియంగా రూ.7కోట్లతో నిర్మించేలా టెండరు పిలుస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జనస్పందన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకలకు చామరాజ నగర్ జిల్లా ప్రముఖ కవి దంపతులకు ఆహ్వానం పంపారు. చామరాజనగర్ జిల్లా కొళ్ళేగాల తాలూకాకు చెందిన కవి మంజునాథ్‌కు ఈమేరకు ఆహ్వానం పంపారు. ఈనెల 24న బెంగళూరు నుంచి ఢిల్లీకు ప్రయాణించేందుకు మంజునాథ్ దంపతులకు విమానం టికెట్‌లను పంపారు. వృత్తిరీత్యా మంజునాథ్ ఎల్ఐసీ ఏజెంట్ కాగా ప్రవృత్తిగా కవిత్వాలు రాస్తుంటారు. కొవిడ్ వేళ మలుగు కందా మలుగు కోసె, మలుగు నన్న జాణమరియే అనే జోలాలి పాట బాగా ప్రాచుర్యం పొందింది. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆన్‌లైన్ రంగోలి, దేశభక్తి గేయాలు, లాలిపాటల పోటీలు జరిగాయి. ఇలా కుమారుడి బలవంతం మేరకు మంజునాథ్ జోలాలి పాటను రచించారు. 550 జిల్లాల నుంచి వచ్చిన రచనలు పంపారు. మంజునాథ్ జోలాలి పాట జాతీయ స్థాయిలో ఎంపిక కాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇందుకుగాను ఆరులక్షల రూపాయలు నగదు బహుమతి దక్కింది. మన్ కి బాత్‌లో ప్రధానమంత్రి మంజునాథ్ రచనను ప్రశంసించారు. రిపబ్లిక్ వేడుకల ఆహ్వానం విషయమై మంజునాథ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో రిపబ్లిక్ వేడుకలకు ఆహ్వానించారని 24న బయలుదేరి 29వరకూ ఢిల్లీలోనే ఉంటానన్నారు. ఇందుకు సంబంధించి ఆహ్వానంతో పాటు విమానం టికెట్లు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.



కవి మంజునాథ్ దంపతులు

కేన్సర్‌తో కుంగిపోవాల్సిన అవసరం లేదు: మంత్రి

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వచ్చినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. దేశంలో తొలిసారిగా ఏఐ ఆధారిత ఆంకాలజీ కేంద్రాన్ని బెంగళూరు అపోలో ఆసుపత్రిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంకాలజీ విభాగంలో ఆధునాతన విధానాలు ఉన్నాయని కేన్సర్ సోకిన వెంటనే భయపడి కుంగిపోవాల్సిన పనిలేదన్నారు. అందుకు అనుగుణమైన చికిత్సలు పొందితే నయం అవుతుందన్నారు. బాధితులకు ఇటువంటి ఆధునాతన విధానాలు అందుబాటులోకి రావడం ధైర్యం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. కేన్సర్‌పై పోరాటం ముఖ్యమన్నారు. అపోలో ఆసుపత్రి ఎండీ సునితా రెడ్డి, కేన్సర్ సెంటర్ ముఖ్యులు విజయ్ అగర్వాల్, సలహాదారుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.



ఆంకాలజీ కేంద్రం ప్రారంభంలో మంత్రి దినేశ్ గుండూరావు తదితరులు

తనిష్క్ ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టాటా సంస్థకు చెందిన భారతదేశపు అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ ఆభరణ ప్రియులకోసం ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్‌ను ఏర్పాటు చేసింది. జీవితంలోని చిన్నచిన్న క్షణాలు సైతం మంత్రముగ్ధులను చేసేలా ముఖ్యమైన మైలురాళ్లకోసం అభిమానులు నిరీక్షిస్తున్న వేళ ఈ అద్భుతమైన ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన డైమండ్ చెవిపోగులు, బ్రాస్‌లెట్‌లు, నెక్‌పేర్‌లు, ఫింగర్ రింగ్‌లను ఊహించని అద్భుతమైన డిజైన్లతో అందుబాటులోకి తెచ్చింది. ఈమేరకు సంస్థ బెంగళూరులో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రూ.15వేలతో ప్రారంభమయ్యే తనిష్క్ డైమండ్ ట్రీట్‌ను ఆస్వాదించాలని పిలుపునిచ్చింది. డైమండ్ ఆభరణాల విలువపై 20శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్టు, ఖాతాదారులు తమ పాతబంగారాన్ని ప్రస్తుత విలువతో వందశాతం మేరకు మార్చుకుని కొత్త వజ్రాల ఆభరణాలను పొందే అవకాశం కూడా కల్పిస్తున్నట్టు తెలిపింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేశవ్యాప్తంగా అన్ని తనిష్క్ ఆభరణాలలో ఈ ఫెస్టివల్ ఏర్పాటైందని జరుగుతోందని తెలిపింది.

